క్లుప్తంగా

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని ఎలక్ట్రిక్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘమైన టీపీఈటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చుక్క సుధాకర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రభుత్వం నుంచి ప్రతి కార్మికులకూ ప్రభుత్వం భూమి మూడు సెంట్లతో పాటు గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణం చేసుకనే విధంగా ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నోజు రాజేశ్వర్‌రావు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు మొక్కులు చెల్లింపు



అమ్మవారికి బంగారు నేత్రాలను అందజేస్తున్న భక్తుడు శివయ్య

ములకలపల్లి: శ్రావణమాసం ఆఖరి ఆదివారం కావడంతో ముత్యాలమ్మతల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుండే భారీగా మహిళలు బోనాలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించుకున్నారు. నాటుకోళ్లు, మేకపోతులు అమ్మవారికి మొక్కులుగా చెల్లించుకున్నారు. ములకలపల్లి శివారులోని ముత్యాలమ్మతల్లి ఉత్సవ విగ్రహానికి స్థానికులు శివయ్య రూ.27వేల విలువగల బంగారు నేత్రాలను విరాళంగా అందజేశారు.

12న మహిళలకు తాంబూలాలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 12వ తేదీన శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా మహిళలకు తాంబూలం అందజేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఏడాది లాగానే ఈ ఏడాది కూడా ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలకు శ్రావణ మాస తాంబూలం అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తాంబూలాన్ని స్వీకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పలివెల రవికుమార్, కార్యదర్శిగా శ్రీధర్ రెడ్డి, కోశాధికారిగా గోడపర్తి రాంబాబుతో పాటు కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బండి లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమన్వయంగా ఉంటూ అసోసియేషన్‌లో ఉన్న పాఠశాలకు ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, గౌరీ శంకర్, సురేష్‌బాబు, మణికంఠ, లైక్‌పాషా, గిరి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

దుమ్ముగూడెం: జీవో నం.3 ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పాండ్ర హేమ సుందర్ డిమాండ్ చేశారు. ఆదివారం నడికుడి గ్రామంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ఆదివాసీ నిరుద్యోగులు బీఈడీలు, టీటీసీలు, డీఈడీలు చేసి ఏ ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నారని, వారికోసం డీఎస్సీ ఉద్యోగాలను వంద శాతం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు, నాయకులు సోయం వినోద్ కుమార్, గట్టుపల్లి సతీష్, కోరం మురళి, కోడి నాగేశ్వరావు, కారం మోహన్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిరసన

అశ్వారావుపేటరూరల్: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరెస్ట్‌పై ఆదివారం ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టగా.. నాయకులు నార్లపాటి శ్రీనివాస్, ఉదయ్, బొడ్డపాటి రమాదేవి, రాకేష్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- తూరుబాక-నర్సాపురం మధ్య ధ్వంసమైన రహదారి
- మూణ్నాళ్ల ముచ్చటగానే మరమ్మతు పనులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ, పోలీస్ శాఖలు



నర్సాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ, దెబ్బతిన్న ఆటో (ఫైల్)



తూరుబాకలో ధ్వంసమైన రహదారి

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక-నర్సాపురం గ్రామాల మధ్య చర్ల-భద్రాచలం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రాణాలు పోతున్నాయి. అయినప్పటికీ అటు ఆర్‌అండ్‌బీ, ఇటు పోలీస్ శాఖలు పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తుండగా ఈ మార్గంలో ఏర్పడిన గుంతల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందో అనే భయం ప్రజల్లో నెలకొంది. అంతేకాక గతుకుల బాటల్లో ప్రయాణానికి ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

ప్రమాద ఘటనలు ఎన్నో..

రోడ్డుపై ఏర్పడిన గుంతల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా నర్సాపురం గ్రామ శివారులో.. అలాగే తూరుబాక వద్ద ఏర్పడిన గుంతల వల్ల ఇప్పటికే రోడ్డు ప్రమాదాటు జరిగాయి. ముగ్గురు వ్యక్తులు మృతిచెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. తూరుబాక-బండారుగూడెం రహదారి దగ్గరలో ఉన్న గుంతలను తప్పించబోయి బండారుగూడెం గ్రామానికి చెందిన కాకా కిరణ్ అనే యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి సిమెంట్ లారీ బోల్తా పడగా డ్రైవర్ చిన్న గాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ అప్రమత్తతో పెనుప్రమాదం తప్పింది. అలాగే జిన్నెలగూడెం గ్రామానికి చెందిన చంటి తన ద్విచక్ర వాహనాన్ని గుంత నుండి తప్పించబోయి కిందపడి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆటో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పినపాక మండల పాండురంగాపురం గ్రామానికి చెందిన నరహరి మృతి చెందాడు. తాజాగా నర్సాపురం గ్రామ చివారులోని గుంతలను తప్పించబోయి ద్విచక్ర వాహనం ఆటో ఢీ కోని మండలోజు ఝాన్సీ అనే మహిళ,దారం మధుసూధన్‌రెడ్డి అనే యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కాక ఇటువంటి ప్రమాదాలు ఎన్నో జరిగి చిన్న చిన్న దెబ్బలతో బయటపడ్డ వారు ఎందరో ఉన్నారు.

నాసిరకంగా మరమ్మతు పనులు..

ఈ ప్రమాదాలకు మూలమైన గుంతలు నాసిరకం పనుల వల్లే ఏర్పడినట్లు విమర్శలు వినవస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం ఈ రహదారిపై చోటుచేసుకున్న ప్రమాదాలపై పలు పత్రికలలో కథనాలు రావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టిన మరమ్మతు పనులు చేయించారు. కాని అవి మూనాళ్ల ముచ్చటగానే మురిశాయి. నిత్యం వందల వాహనాలు తిరిగే రహదారి మరమ్మతు పనులను రాత్రి సమయంలో చేపట్టడంతో అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. దానికి తగ్గట్టుగానే ఎక్కడెక్కడ మరమ్మతు పనులు చేపట్టారో ఒకటి, రెండు చోట్ల తప్పా మళ్లీ యథాస్థితికి వచ్చింది. రోడ్డుపై గుంతలు పడ్డ దగ్గర అయినా కనీసం హెచ్చరిక బోర్డులు చేసింది లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఇలా రోడ్డు ప్రమాదాలకు మారినట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లారీల మూలంగా గుంతలు

నిత్యం వందల వాహనాలు తిరిగే రహదారిపై ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు దృష్టి పెట్టడం లేదు. ముఖ్యంగా రోడ్లు ధ్వంసం కావడానికి ప్రధాన కారణం అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలే. వీటి వల్ల గుంతలు పడుతున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

– బొల్లి సత్యనారాయణ, తూరుబాక ఉప సర్పంచ్

అధికారుల స్పందన శూన్యం..

తూరుబాక-నర్సాపురం గ్రామాల మధ్యన ధ్వంసం అయిన రోడ్డు మరమ్మతుల విషయంలో అధికారుల జాప్యం కనిపిస్తోంది. దీంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరిగుతున్నాయి. ఈ ఏడాది కాలంలో ఈ రోడ్డుపై నలుగురు మృతి చెందారు. ఎందరో గాయాల పాలయ్యారు.

– రావులపల్లి పృథ్వీ, సీపీఐ నాయకుడు

ప్రతిపాదనలు పంపించాం..

రోడ్డు మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చాక పనులు చేపడతాం. ఇసుక లారీల వల్ల రోడ్డు పాడవుతోంది. ముఖ్యంగా అధిక లోడ్‌తో ఇసుక లారీలు నడపడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఈ పరిస్థితి మారాల్సి ఉంది.

– హరిలాల్ ఆర్‌అండ్‌బీ డీఈ

అనుమతులు తప్పనిసరి



బూర్గంపాడు: ఉత్సవ కమిటీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

బూర్గంపాడు: గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. విద్యుత్‌శాఖ, గ్రామపంచాయతీల నుంచి తప్పనిసరిగా మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలన్నారు. మైక్ పర్మిషన్‌ను పోలీస్‌శాఖ నుంచి తీసుకోవాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగేవిధంగా మండపాలను ఏర్పాటు చేయవద్దని, అలా చేస్తే ఆయా మండపాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ములకలపల్లి: ప్రశాంత వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని ఎస్సై సాయికిషోర్ రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మతపెద్దలు, ఉత్సవకమిటీ బాధ్యులతో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎస్సై మాట్లాడారు. వినాయక ఉత్సవ కమిటీలు ముందస్తుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆహ్లాదంగా పండుగ జరుపుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు.

పునర్వసు కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా ఆదివారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపం లోకి తీసుకుని వచ్చారు.

కల్యాణంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యూత్రా ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు, మహా సంకల్పం మంగళాష్టకాలు, జీలకర బెల్లం మాంగల్య పూజ మాంగల్య ధారణ మంగళ హారతి, మంత్రపుష్పం చేపట్టారు. ఈ కల్యాణాన్ని పర్ణశాలకు చెందిన ఇద్దరు దంపతులు పీటలపై కూర్చుని చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు అమరవాది, శ్రీకాంత్ కృష్ణమాచార్యులు, శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, ఆలయ సూపర్డెంట్ కిషోర్, గుమస్తా ప్రసాద్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

చర్ల: తెలంగాణా సాయుధ పోరాట వార్సికోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన చర్లలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిర్వహించిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని అన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం సాగించి సెప్టెంబర్ 17 నాటికి 75 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఆ రోజు నుంచి జరిగే వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, నాయకులు కొంగూరు రాము, నానిపల్లి భద్రం, ప్రసాద్, వామనరావు, శ్రీను, రాజు, రవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ సభకు తరలిన ముస్లింలు

చంద్రుగొండ: ముస్లిం హక్కుల సాధనకు జామాతే ఉలేమాహిండ్ ఆధ్వర్యంలో నల్లగొండలో ఏర్పాటు చేసిన సభకు ముస్లింలు ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. దేశంలో ముస్లింల మనుగడ, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై గళం విప్పేందుకు ఈ సభ ఏర్పాటు చేసినట్లు మసీద్ కమిటీ అధ్యక్షుడు యండి.షమీహుసేన్ చెప్పారు. తరలివెళ్లిన వారిలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రసూల్, భోలే, ఆదం, యాఖుబ్, దస్తగీర్, ఎంఏ వాహెద్ ఉన్నారు.

సంక్షేమానికి పెద్దపీట



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు ప్రభుత్వ విప్ రేగా సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భూక్యా శ్రావణి, ఉప సర్పంచ్ యడమకంటి ఝాన్సీ, ముస్లిం మైనార్టీ నాయకులు సాధిక్, గుల్ మహ్మద్, సుభాని, పాషా, మొండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మేగడం శ్రీనివాసరెడ్డి, దారం కృష్ణారెడ్డి, ఇమడాబత్తుని రామకృష్ణ, అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రెడ్డెం రామకృష్ణారెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బూర్గంపాడు మండలం నాగినిప్రోలు రెడ్డిపాలెం గ్రామపంచాయతీకి చెందిన 30 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీని వీడి ఆదివారం మణుగూరు క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు వీరికి బిఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలోని చేపలమార్కెట్ ఏరియాలో ఉన్న స్నేహ ఫంక్షన్ హాల్‌లో శ్రీవిద్య, కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాటాడుతూ.. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గత ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లా, మండల స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీఐ చేతుల మీదుగా జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్, శ్రీవిద్య విద్యాసంస్థల డైరెక్టర్ నూకారపు రమేష్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మర్రి సారంగపాణి, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మణుగూరురూరల్: ప్రజలకు మేలు.. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండల, మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్, కూనవరం తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన గడప గడపకు కాంగ్రెస్ పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్రలో పార్టీ డిక్లరేషన్లను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు. తొలుత పాదయాత్ర నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయంకు మహిళలు హారతులు, పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా ప్రజలకు జరిగిన అభివృద్ధి ఏమి లేదన్నారు. కార్యక్రమంలో మణుగూరు వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వెంకట్రావు గౌడ్, కనకయ్య, బాజీ, తరుణ్‌రెడ్డి, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, పాల్వంచ రాములు, శ్రీనివాస్‌రావు, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కాంగ్రెస్‌లో చేరిక

గడప గపడకూ కాంగ్రెస్ పాదయాత్రలో భాగంగా పార్టీ డిక్లరేషన్స్‌కు ఆకర్షితులై శేషగిరినగర్‌లో 50 కుటుంబాలు, కూనవరం గ్రామంలో 120 కుటుంబాలు.. మొత్తం 170కుటుంబాల వారు వివిధ పార్టీలను వీడి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

నాసిరకంగా రహదారి నిర్మాణం



నాసిరకంగా నిర్మిస్తున్న కొండతోగు బీటీ రహదారి

అశ్వారావురూరల్: మండలంలోని మల్లాయిగూడెం నుంచి కొండతోగు గిరిజన గ్రామానికి నిర్మిస్తున్న బీటీ రహదారి నిర్మాణం నాసిరకంగా సాగుతోంది. రహదారి నిర్మాణం పూర్తి కాకముందే డొల్లతనం వెలుగులోకి రావడంతో గ్రామస్తులు సోషల్ మీడియాలో అధికార పార్టీ, అధికారుల తీరుపై ఫొటోలు షేర్ చేసి ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మూడు నెలల క్రితం స్థానిక సర్పంచ్ నారం రాజశేఖర్ వినతి మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మల్లాయిగూడెం-కొండతోగు గ్రామాలకు ఐటీడీఏ నిధులు రూ.65లక్షల వ్యయంతో బీటీ రహదారి, కల్వర్టులను మంజూరు చేయించారు. కాగా ఈ పనులను దక్కించుకున్న ఓ కాంట్రాక్టరు కొద్ది నెలలుగా కల్వర్టు పనులు పూర్తి చేసి, తాజాగా బీటీ రోడ్డు పనులు చేపట్టారు. అయితే ఈ బీటీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మించిన కొద్ది రోజుల్లోనే తారు లేచిపోతుండగా, గుంతలు పడుతున్నాయి. ఇలా దాదాపు 500 మీటర్ల దూరం వరకు తారు ధ్వంసం కాగా, ఇంకా రహదారి నిర్మాణం పూర్తి కాకుండానే ఇలా డొల్లతనం బయటపడింది. దీంతో గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా తనిఖీలు



ఆర్ కొత్తగూడెంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో ప్రతీ ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని వివిధ అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. ఇందులో భాగంగా చర్లలోని గాంధీ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, లక్ష్మీకాలనీ, పెట్రోల్‌బంక్ సెంటర్, కలివేరుక్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం, తాలిపేరు ప్రాజెక్ట్ ప్రాంతాల్లో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు.. వచ్చి పోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితుగా భావించిన పలువురిని అదుపులోకి తీసుకుని నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు. చర్ల సీఐ బి.రాజగోపాల్ నేతృత్వంలో ఈ తనిఖీలు కొనసాగాయి.

'వీరనారి'కి ఘన నివాళి

వీరనారి, తెలంగాణ సాయుధ పోరాట నిప్పురవ్వ చాకలి ఐలమ్మ వర్ధంతిని ప్రభుత్వ అధికారులు, సీపీఎం, రజక సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం వేరువేరుగా నిర్వహించారు. ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, దొరల గడియల నుంచి తెలంగాణ విముక్తి కోసం వీరోచిత పోరాటాలు చేసిన ఐలమ్మను ప్రజాప్రతినిధులు, అధికారులు స్మరించుకున్నారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నేటితరం ఉద్యమించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు



బూర్గంపాడు: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు



భద్రాచలంటౌన్: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ



భద్రాచలంఅర్బన్: సీపీఎం నాయకుల నివాళి



అశ్వారావుపేటరూరల్: ఎంపీపీ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో..



దుమ్ముగూడెం: చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చర్ల: నివాళులర్పిస్తున్న నాయకులు